# నేను పక్కా లోకల్



తిమ్మానగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

- కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవొద్దు
- ఆశీర్వదించండి సేవకుడిగా పనిచేస్తా..
- జుక్కల్ ఎమ్మెల్యే అభ్యర్థి హన్మంత్ షిండే
- పిట్లం మండలంలో ఎన్నికల ప్రచారం

పిట్లం, నవంబర్ 5: నేను పక్కా లోకల్ అని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను నమ్మి మోసపోవద్దని బీఆర్‌ఎస్ జుక్కల్ అభ్యర్థి హన్మంత్‌షిండే అన్నారు. ఆయన ఆదివారం మండలంలోని తిమ్మానగర్, మార్దండ, కంబాపూర్, గోద్మేగాం, కారేగాం, బుర్నాపూర్, అల్లాపూర్, పారడ్‌పల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి హన్మంత్‌షిండేకు మహిళలు మంగళహారతులు, భాజా భజంత్రీలతో ఘనంగా శివారు నుంచి గ్రామం వరకు ఘనస్వాగతం పలికారు. అనంతరం హన్మంత్‌షిండే మాట్లాడుతూ.. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లు అభ్యర్థులు దొరక్క ఒకరు నిజామాబాద్ నుంచి మరొకరు సంగారెడ్డి నుంచి తెచ్చుకొని బరిలో నిలుపుతున్నారన్నారు. నియోజకవర్గంలోని డోన్‌గావ్ గ్రామానికి చెందిన తనను మీ బిడ్డలా ఆదరించి కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సుగ్గి మాదిరిగా వచ్చిన నాయకులను నమ్మి నియోజకవర్గ ప్రజలు మోసపోవొద్దని, సీఎం కేసీఆర్ హయాంలో నియోజకవర్గంలో వంద గ్రామాలకు బీటీ రోడ్లు, ప్రధాన గ్రామాల వద్ద బ్రిడ్జిల నిర్మాణం చేపట్టామని తెలిపారు. నియోజకవర్గంలోని 40 వేల ఎకరాలకు సాగు నీరు అందించేలా సీఎం కేసీఆర్ 476 కోట్లతో నాగమడుగు లిఫ్టు నిర్మాణ పనులు చేపడుతున్నారన్నారు. దీంతో నియోజకవర్గంలోని బీడు భూములు సాగులోకి వస్తాయని తెలిపారు. రైతులు సమావేశాలు నిర్వహించుకునేందుకు ప్రతి క్లస్టర్ పరిధిలో రైతువేదిక భవనాలను నిర్మించి అన్నదాతలకు అండగా నిలిచామన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పథకం అందని ఇల్లు లేదని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రతి గ్రామంలో మహిళా సంఘాల భవనాలు నిర్మిస్తామని, అగ్ర కులాల నిరుపేద పిల్లల కోసం గురుకులాలను ఏర్పాటు చేస్తామని, సౌభాగ్య లక్ష్మి పథకం ద్వారా నిరుపేద మహిళకు రూ.మూడు వేలు అందజేసి ఆదుకుంటామన్నారు. సిలిండర్‌ను రూ.400కు అందిస్తామని, ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.15 లక్షలకు పెంచి ఆదుకోనున్నారని పేర్కొన్నారు. పదేండ్లలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించాలని, మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. ప్రచారంలో భాగంగా పలువురిని పేరుపేరునా ఆప్యాయంగా పలుకరించారు. భారీ మెజార్టీతో గెలిపిస్తామని ప్రజలు ఆయనకు భరోసా ఇచ్చారు. ప్రచారంలో ఎంపీపీ కవిత, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేశ్, నాయకులు అన్నారం వెంకట్‌రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జొన్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సాగౌడ్, జగదీశ్, విజయ్, సాయిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, రజినీకాంత్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, సర్పంచులు అనితా పండరి, కవిత, మల్లిపోచవ్వ, దుర్గయ్య, సరోజా శివాజీరావు, కవితా శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణా శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గిరిజన మహిళలతో ఎమ్మెల్యే షిండే



పాదయాత్రగా వెళ్తూ.. ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి షిండే

## ఎల్ ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రచారం



పెద్దశక్కర్గ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

మద్నూర్, నవంబర్ 5: మండలంలో ఎల్‌ఈడీ స్క్రీన్ల ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలోని పెద్ద శక్కర్గ గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం కొనసాగింది. జుక్కల్ ఎమ్మెల్యేగా షిండేను మరోసారి గెలిపించాలని స్థానిక నాయకులు కోరారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, జరిగిన అభివృద్ధిని ఎల్‌ఈడీ స్క్రీన్ల ద్వారా వివరిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబూ పటేల్, నాయకులు ఎన్‌ఎం బాలరాజు, రమేశ్ దేశాయి, హన్మంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల బరువు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

నిజాంసాగర్, నవంబర్ 5: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల బరువు విషయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రసాద్ అన్నారు. మండలకేంద్రంలోని బంజారాహిల్స్ కాలనీలో ఆయన ఆదివారం పర్యటించారు. అంగన్‌వాడీ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన పౌష్టికాహారంతోపాటు బాలామృతాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులకు ప్రతి రోజూ పోషకాలతో కూడిన ఆహారం, పాలు, గుడ్లు అందించాలన్నారు. గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటేనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఆయనవెంట కార్యకర్త విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.



బాలామృతం పంపిణీని పరిశీలిస్తున్న అధికారి

# అభివృద్ధికి చిరునామా గాంధారి

- రూ. 10 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం
- మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులు
- హర్షం వ్యక్తంచేస్తున్న మండల ప్రజలు

గాంధారి, నవంబర్ 5: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరగని అభివృద్ధి పనులు ప్రస్తుతం సీఎం కేసీఆర్ పాలనలో చకచకా జరుగుతున్నాయి. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సహకారంతో గాంధారి మండల ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది. ఇటీవల రూ.పది కోట్ల నిధులతో మండల కేంద్రం గాంధారిలో రోడ్డు వెడల్పు పనులు పూర్తిచేశారు. ప్రధాన రోడ్డుతోపాటు రహదారికి ఇరువైపులా డ్రైనేజీలను నిర్మించారు. గతంలో చిన్నపాటి వర్షం కురిసినా.. రోడ్డు పైన నీరు ప్రవహించి బురదగా మారేది. ఎండ కొడితే దుమ్ము లేచి దుకాణదారులు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రోడ్డు వెడల్పు పనులు చేపట్టాలని గతంలో అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయేది. కానీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మండల ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గాంధారి ప్రజల సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. రూ.పది కోట్ల నిధులను మంజూరు చేయడంతో రోడ్డు వెడల్పుతోపాటు సెంట్రల్ లైటింగ్, రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు, సెంట్రల్ డివైడర్ పనులను చేపట్టారు. స్థానిక వాగుపై ఉన్న బ్రిడ్జి నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు రోడ్డు వెడల్పు, సెంట్రల్ డివైండింగ్ పనులు పూర్తికావడంతో రహదారి విశాలంగా, అందంగా మారింది. మండల ప్రజల ఏండ్ల కల నెరవేరడంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి సురేందర్‌ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని ప్రజలు అంటున్నారు.



సెంట్రల్ లైటింగ్ వెలుగులు



గాంధారిలో వేసిన డబుల్ రోడ్డు

### మరోసారి ఆశీర్వదిస్తే.. మరింత అభివృద్ధి చేస్తా..



ఎల్లారెడ్డి నియోజకవర్గంలో గతంలో ఎప్పుడూ జరగని అభివృద్ధి చేశా.. గాంధారితోపాటు నియోజకవర్గ ప్రజలు మరోసారి ఆశీర్వదిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తాను. గాంధారి మండల ప్రజల ఏండ్ల కల అయిన డబుల్ రోడ్డు పనులను రూ.పది కోట్లతో పూర్తి చేశాం. ప్రతి గ్రామంలో ఇప్పటివరకు రూ.60లక్షల నుంచి కోటి రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టాం. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గ ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందేవిధంగా కృషి చేస్తా..

**-జాజాల సురేందర్, ఎమ్మెల్యే, ఎల్లారెడ్డి**

## అధునాతన పద్ధతుల్లో వ్యవసాయం



నీటి పారకం కోసం స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకున్న రైతు

డోంగ్లీ, నవంబర్ 5: మండల రైతులు అధునాతన వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తున్నారు. అక్టోబర్ నెలలో వర్షాలు కురువకపోవడంతో రైతులు నీరు పారపెట్టి విత్తనాలను విత్తుతున్నారు. నీటిని పారబెట్టేందుకు స్ప్రింక్లర్లను ఉపయోగిస్తున్నారు. దీంతో ఖర్చు తగ్గుతున్నదని రైతులు అంటున్నారు. రోజుకు ఎకరం పైగా పొలానికి నీరు పారబెడుతున్నట్లు తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ సాగు పని అవుతున్నదని రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.